క్లుప్తంగా

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



కల్వకుర్తి: మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని సంజాపూర్‌లో వీధిదీపాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షాహెద్, మధు, వెంకటేష్, ఎల్లయ్య, రాజు, మహేష్, బాలకృష్ణ, చారి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పశుసంపదను కాపాడుకుందాం

తాడూరు: పశు సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వైద్య అధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని ఎటిదార్‌పల్లిలో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరంలో ఆయన పాల్గొని పశువులకు గర్భకోశ నివారణ చికిత్సలు నిర్వహించారు. దూడలకు నట్టల నివారణ పంపిణీతో పాటు సీజనల్‌గా పశువులకు సంక్రమించే వ్యాధుల నివారణ మందులను అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాజేష్ కుమార్, గోపాలమిత్రులు పర్వతాలు, ఆనంద్, గోపాల్, వైద్య సిబ్బంది రవిగౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

చారకొండ: మండలంలోని గోకారం గ్రామానికి చెందిన కిన్నెర ఎల్లమ్మ శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి రూ.5 వేలు సమకూర్చగా గ్రామస్తులు బాధితకుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. మాజీ ఎంపీటీసీ కొండల్, నాయకులు నాగేష్,వెంకటయ్య,సైదయ్య, కృష్ణయ్య, పర్వతాలు, తదితరులు ఉన్నారు.

వాల్ పోస్టర్ల విడుదల



తాడూరు: మండల కేంద్రంలో శనివారం సీపీఎం రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను మండల కార్యదర్శి కాశన్న ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ నెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు సంగారెడ్డి పట్టణంలో నిర్వహించే సీపీఎం నాల్గో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మహేష్, ఎ కాశన్న, శంకర్, వెంకటస్వామి పాల్గొన్నారు.

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: అమిత్‌షాను కేంద్ర మంత్రి పదవి నుంచి తొలగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం బాలనరసింహ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక జిల్లా సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగాన్ని అవమానించడం సరికాదన్నారు. దేశ ప్రజలకు మంత్రి క్షమాపణ చెప్పాలన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు హెచ్ ఆనంద్‌జిత్, కేశవులు గౌడ్, వార్ల వెంకటయ్య, నాయకులు ఇందిరమ్మ, టి నరసింహ, విజయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫిజిక్స్ అరుణ్‌కుమార్‌కు జాతీయ పురస్కారం



కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన ఫిజిక్స్ అరుణ్‌కుమార్‌కు తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ, గోదావరి సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు తేజం జాతీయ విశిష్ట సాహితీ పురస్కారం దక్కింది. ఈ నెల 21వ తేదీన విజయవాడలో నిర్వహించే కార్యక్రమంలో పురస్కారం అందుకోనున్నారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ కళావేదిక జాతీయ కార్యదర్శిగా పనిచేస్తూ ఉభయ తెలుగు రాష్ట్రాలలో సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వాహణలో తన వంతు పాత్ర పోషిస్తున్నానని తెలిపారు. తనకు ఈ పురస్కారం ప్రకటించిన సంస్థల నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

పాన్‌గల్: బడీడు పిల్లలు బడిలో ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం 'పిల్లలు బడిలో–పెద్దలు పనిలో' కార్యక్రమాన్ని చేపట్టిందని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. బడిబయట పిల్లల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రం పాన్‌గల్‌లో ఇంటింటి సర్వే నిర్వహించారు. బడిబయట ఉన్న 2వ తరగతి విద్యార్థిని ఇలియానా, 6వ తరగతి విద్యార్థిని షామీరానను గుర్తించి బడిలో చేర్పించారు. వెంకటేష్‌యాదవ్, సీఆర్పీలు గోవింద్‌నాయక్, రమాదేవి, భార్గవి పాల్గొన్నారు.

ముమ్మరంగా సర్వే

సాక్షి, నెట్‌వర్క్: ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులపై చేపడుతున్న సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ అమరేందర్ అన్నారు. శనివారం ఆయన తెలకపల్లి, చారకొండ తహసీల్దార్ కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు. అచ్చంపేట మండలం చందాపూర్‌లో సర్వేను తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈనెల 20వ తేదీ వరకు సర్వే పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా తెలకపల్లి మండలంలోని జమీస్తపూర్, గట్టు నెల్లికుదురు, ఆలేరు, అనంతసాగర్ గ్రామాల్లో సర్వే కొనసాగింది. తెలకపల్లి, అచ్చంపేట, చారకొండ తహసీల్దార్లు జాకీర్ అలీ, చంద్రశేఖర్, సునీత, ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, అచ్చంపేట ఎంపీడీఓ మధుసూదన్‌గౌడ్, డీఎస్ఓ శ్రీనివాసులు, ఎంపీఓ వెంకటేష్, ఏఓ నర్మదా తదితరులు పాల్గొన్నారు.



చారకొండలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అమరేందర్

● ఉప్పునుంతల మండలంలోని పెద్దాపూర్, లక్ష్మాపూర్, జప్తీసదగోడు, ఫిరట్వానిపల్లిలో నిర్వహిస్తున్న సర్వేను తహసీల్దార్ ప్రమీల, ఎంపీడీఓ మోహన్‌లాల్, ఏఓ రమేష్ పర్యవేక్షించారు.

● పెద్దకొత్తపల్లి పెద్దకారుపాములలో కొత్తరేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల జాబితాలను తహసీల్దార్ జేకే మోహన్ పరిశీలించారు. ఆర్‌ఐ వెంకటేష్, సర్వేయర్ బాబు నాయక్, జూనియర్ అసిస్టెంట్ నాగరాజు, ఎఈఓ జానకి రామ్, కార్యదర్శి రాజు, నాయకులు విష్ణు, శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొన్నారు.

● తాడూరు మండల కేంద్రంతో పాటు పర్వతాయపల్లి, తుమ్మలసుగూర్, ఎంగపల్లి, అంతారం గ్రామాలలో రైతుభరోసా సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. ఏఓ సందీప్ కుమార్‌రెడ్డి, తహసీల్దార్ కిరణ్మయి, ఎంపీడీఓ ఆంజనేయులు సంబంధిచిన అధికారులు పాల్గొన్నారు.



తెలకపల్లిలో వివరాలు సేకరిస్తున్న అధికారులు



తాడూరు మండలం పర్వతాయపల్లిలో..



పెద్దకొత్తపల్లి, పెద్దకారుపాములలో..

పారదర్శకంగా పథకాల అమలు

నాగర్‌కర్నూల్: ప్రభుత్వ పథకాలకు పారదర్శకంగా అర్హుల జాబితా రూపొందిస్తామని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా పథకాలపై శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సమాచార, పౌరసరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఆయా పథకాలకు అర్హుల ఎంపిక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా చేపట్టినట్లు వివరించారు. అర్హుల ఎంపికలో ఎలాంటి అపోహలకు తావులేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

కల్వకుర్తి టౌన్: పట్టణంలో 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని శనివారం కలెక్టర్ బదావత్ సంతోష్ పరిశీలించారు. కల్వకుర్తి ఆర్డీవో శ్రీను, రెవెన్యూ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని డబుల్ బెడ్రూం సమీపంలో ఉన్న 99వ సర్వే నంబర్‌లో గల 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన స్థలానికి సంబంధించి విస్తీర్ణం, రోడ్డు అనుసంధానం, భౌగోళిక పరిస్థితులు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. స్థలాన్ని మరోసారి పరిశీలించి ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆర్డీఓకు ఆదేశించారు. రెవెన్యూ అధికారులు ఉన్నారు.

వెల్దండ: మండలంలోని కొట్రలో శనివారం కలెక్టర్ బదావత్ సంతోష్ నర్సరీలను, పల్లె దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఆవరణలో ఉన్న నర్సరీలలో మొక్కలు లేకపోవడంతో అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పల్లెదవాఖానాను తనిఖీ చేశారు. వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఆర్డీఓ శ్రీను, తహసీల్దార్ కార్తీక్‌కుమార్, ఎంపీడీఓ సత్యపాల్ రెడ్డి, ఎంపీఓ లక్ష్మణ్, కార్యదర్శి భాస్కర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ భీమానాయక్, ప్రోగ్రామ్ ఆఫీసర్ లక్ష్మణ్, డాక్టర్ సింధు, వైద్య సిబ్బంది ఉన్నారు.



ఊర్కొండపేటలో ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న కలెక్టర్ బదావత్ సంతోష్

ఊర్కొండ: మండలంలోని ఊరుకొండ పేటలో పబ్బతి ఆంజనేయ స్వామి దేవాలయాన్ని కలెక్టర్ బదావత్ సంతోష్ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో కలెక్టర్‌ను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈనెల 25న ప్రారంభం కానున్న ఆలయ బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆలయ ధర్మకర్తలు, నాయకులు అందజేశారు. కార్యక్రమంలో కల్వకుర్తి ఆర్డీఓ శ్రీను, ఊర్కొండ మండల ప్రత్యేక అధికారి సంతోష్ రావు, తహసీల్దార్ రాంకోటి, ఎంపీడీఓ కృష్ణయ్య, వ్యవసాయ అధికారి కుమారి దీప్తి, ఎంపీఓ లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి ఇబ్రహీం, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

వెల్దండ: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కేంద్ర ఆరోగ్య శాఖ పరిశీలకులు డాక్టర్ ఆరోకియ రుబీన్‌రాజ్, డాక్టర్ నిశాంత్‌లు కోరారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలంలో కొట్ర పల్లె దవాఖానా వైద్యులు, సిబ్బందితో వారు మాట్లాడారు. జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ భీమానాయక్, ఎంహెచ్ఎన్ ప్రొగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్లు మంజుభార్గవి, సింధు, జిల్లా కాల్విటికంట్రోల్ ఆఫీసర్ సంతోష్, సూపర్‌వైజర్లు, హెల్త్ అసిసెంట్లు, ఆశాకార్యకర్తలు తదితరులు ఉన్నారు.



వీసీలో మాట్లాడుతున్న వైద్యులు

వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం

లింగాల: సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎస్సీ వర్గీకరణను అమలు చేసి మాదిగలు, మాదిగ ఉప కులాలకు సామాజిక న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సొట కాశీం ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో శనివారం మాదిగ మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించి ఎమ్మార్పీఎస్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతోనే రిజర్వేషన్ల ఫలాలు సమానంగా అందుతాయని అన్నారు. ఫిబ్రవరి 7వ తేదీన ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ లక్ష డప్పులు, వేయి గొంతుల కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి మాదిగలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడిగా పానుగంటి సిద్ధు, గౌరవ అధ్యక్షుడిగా బంగారయ్య, ఉపాధ్యక్షుడిగా పాపగంటి బాబు, ప్రధాన కార్యదర్శిగా గుమ్మకొండ ఈశ్వర్, పలువురిని సలహాదారులుగా, కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మహేష్, కొండల్ పాల్గొన్నారు.



నియమక పత్రాలు అందజేస్తున్న సొట కాశీం

22న లక్ష్మీనర్సింహాస్వామి హుండీ లెక్కింపు

తిమ్మాజిపేట: మండలంలోని అప్పాజిపల్లి గుట్టపై వెలసిన లక్ష్మీనర్సింహాస్వామి హుండీని 22న లెక్కించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు రాంచంద్రారెడ్డి, రాందేవ్‌రెడ్డి, రమేష్, ఎల్లారెడ్డి తెలిపారు. 12 నుంచి 14 వరకు నిర్వహించిన బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

ఆకస్మిక తనిఖీ



బిజినేపల్లి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీని శనివారం జిల్లా టీకాల అధికారి డా. కే రవికుమార్‌నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న వైద్య సేవలను, ల్యాబ్‌లో నిర్వహిస్తున్న పరీక్షలతో పాటు పీహెచ్‌సీకి సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్, డాక్టర్ కిరణ్, సిబ్బంది ఆంజనేయులు, గంగ, కుమార్ తదితరులు ఉన్నారు.

టీబీపై అవగాహన



పెద్దకొత్తపల్లి: మండలంలోని కల్వకోల్‌లో టీబీ ముక్త్ భారత్ అభియాన్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రజలకు టీబీపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీహెచ్‌ఓ జీవీ శ్రీనివాస్ మాట్లాడుతూ టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తుందన్నారు. 15 మంది నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలకు పంపించారు. సూపర్‌వైజర్ ముక్తర్ అహ్మద్, వెంకటమ్మ, సజాతలు పాల్గొన్నారు.

చిన్నారికి రక్తదానం

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రాణాపాయస్థితిలో ఉన్న క్యాన్సర్ బారిన పడి చిన్నారికి యువశక్తి ఫౌండేషన్ సభ్యులు ముందుకు వచ్చి శనివారం హైదరాబాద్‌లో రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. జిల్లా కేంద్రానికి చెందిన మంజుల కుమారుడు రిషి క్యాన్సర్‌తో బాధపడుతూ నెలరోజులుగా హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాబుకు ప్లేట్‌లెట్స్ తక్కువకావడంతో బాధిత కుటుంబసభ్యులు యువశక్తి ఫౌండేషన్‌ను సంప్రదించడంతో ఫౌండేషన్ సభ్యులు బాలకృష్ణ, మహేష్, చెన్నయ్యలు ముందుకు వచ్చి రక్తదానం చేశారు.

ప్రతిఒక్కరూ సేవాదృక్పథం అలవర్చుకోవాలి

కల్వకుర్తి రూరల్: ప్రతిఒక్కరూ సేవాదృక్పథం అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా లయన్స్ క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కల్వకుర్తి మండలంలోని గుండూరులో జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జన్మదినం సందర్భంగా ఆల్ ఇన్ వన్ పుస్తకాలను గ్రామానికి చెందిన సురభి వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ కల్వకుర్తి అధ్యక్షుడు కల్మిచర్ల రమేష్, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, బచ్చు రామకృష్ణ, జూలూరు రమేష్ బాబు, శ్రీధర్, మిరియాల శ్రీనివాస్ రెడ్డి, గుబ్బ కిషన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, ప్రవీణ్, వెంకటేష్, తదితరులు పలువురు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యేను ఆ పార్టీ కార్యకర్తలు సన్మానించారు. అనంతరం కేక్‌కట్ చేసి కార్యకర్తలు పంచుకున్నారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.



వెల్దండలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

చారకొండ: కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా మండలంలోని జూపల్లిలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్‌చేశారు.

భక్తిశ్రద్ధలతో శనేశ్వరుడికి పూజలు



బిజినేపల్లి: మండలంలోని జైష్ట్యాదేవి సమేత శనేశ్వరునికి భక్తులు భక్తిశ్రద్ధలతో తిలతైలాభిషేక పూజలు నిర్వహించారు. భక్తులతో శనిదోష నివారణకు ఆలయ ప్రధాన అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి పూజలు చేయించారు. ఆలయ అర్చకబృందం, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

లింగాల: మండలంలోని అవుసలికుంట ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన పలువురు దాతలు చేయూత ఇవ్వడం అభినందనీయమని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. గ్రామానికి చెందిన రంగినేని చక్రధర్‌రావు పాఠశాలకు మినిరల్ వాటర్ ప్లాంట్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా శనివారం దాతతో కలిసి ఎంపీడీఓ ప్లాంటును ప్రారంభించారు. దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు చదువుల్లో రాణించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు వాటర్ బాటిళ్లను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పాండురంగం, కమిటీ చైర్మన్ నాగమణి, మాజీ సర్పంచు ఎల్లయ్య, పంచాయతీ కార్యదర్శి చంద్రయ్య, ఉపాధ్యాయులు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు అన్యాయం చేయొద్దు



పెంట్లవెల్లి: ప్రభుత్వం చేపడుతున్న సర్వేలో నిజమైన అర్హులకు అన్యాయం చేస్తూ ఊరుకోమని సీపీఎం జిల్లా నాయకుడు ఈశ్వర్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో 22, 27 సర్వే నంబర్‌లో ఉన్న భూమిని పేదలకు పంపిణీ చేసి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలన్నారు. గ్రామసభల్లో పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు. కార్యక్రమంలో లింగస్వామి, లక్ష్మయ్య, గోవిందమ్మ, వెంకటస్వామి, పెంటయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

మన్ననూర్: దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తానని వికలాంగుల విభాగం విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు వడ్త్యావత్ రాజశేఖర్ నాయక్ అన్నారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఇండియా నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగిన ఆయనను శనివారం జిల్లా వికలాంగుల విభాగం విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా కలెక్టర్ బదావత్ సంతోష్ నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఏళ్లుగా వివిధ హోదాలలో వికలాంగుల అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడ్డానన్నారు. కార్యక్రమంలో కొడవత్ రఘునందన్‌రెడ్డి, శంకర్, వెంకటయ్య, నారాయణమ్మ, ఆసన్న, రామకృష్ణారెడ్డి, రవి, గణేష్, కుమార్, మల్లయ్య, విజయ్, సుజాత పాల్గొన్నారు.

సారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ దాడులు

లింగాల: మండలంలోని చెన్నంపల్లి, పద్మన్నపల్లి, దారారం గ్రామాల్లో జిల్లా ఎక్సైజ్ అధికారి గాయత్రి పర్యవేక్షణలో శనివారం సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ రమణయ్య తెలిపారు. 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. 12 లీటర్ల సారాను స్వాధీన చేసుకునట్లు పేర్కొన్నారు. పద్మన్నపల్లికి చెందిన మూడావత్ బుజ్జి, కాట్రావత్ అనూష, దారారంకు చెందిన వడిత్యా నీలాపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. డీటీఎఫ్, తెలకపల్లి స్టేషన్, ఎస్‌హెచ్‌ఓ నాగర్‌కర్నూల్ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం పానకం ధ్వంసం

కోడేరు: మండలంలోని తాగూరు తండాలో ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి 250 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీదారులను తహసీల్దార్ విజయ్‌కుమార్ ఎదుట బైండోవర్ చేశారు.

కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్ తండా, కురుమిద్ద, జీడిపల్లి తండాలలో ఎక్సైజ్ ఏఈఎస్ సుధాకర్ గౌడ్ నేతృత్వంలో దాడులు నిర్వహించారు. 350 కేజీల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీదారుడు భాస్కర్‌ను అదుపులోకి తీసుకొని 30 కేజీల బెల్లం, 10 కేజీల పట్టిక, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ జిల్లెల్ల వెంకటరెడ్డి తెలిపారు. డీటీఎఫ్ ఎస్ఐ రాజేందర్ సిబ్బంది పాల్గొన్నారు.



కల్వకుర్తిలో బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న సీఐ వెంకటరెడ్డి, సిబ్బంది

హామీలు అమలు కోసం పోరాడుతాం



కందనూలు: ఆరు గ్యారంటీల హామీల అమలుకోసం పోరాడుతామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగం శశిధర్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ, ఉచిత విద్యుత్, కల్యాణలక్ష్మి హామీలు ప్రభుత్వం విస్మరించిందన్నారు. సర్వేల పేరుతో కాలయాపన చేస్తూ ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బుద్ధిచెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. బీఆర్ఎస్ నాయకులు అర్థం రవి, బాలాగౌడ్, లక్ష్మయ్య, భీముడు, శ్రీశైలం, పాండు, పాషా ఉన్నారు.

ఆర్టీసీ డీఎం ఆదేశాలు బేఖాతర్



తిమ్మాజిపేట: నాగర్‌కర్నూల్–జడ్చర్ల ప్రధాన రహదారిపై కోడుపర్తి మిట్ట వద్ద ఆర్టీసీ బస్సు నిలపాలని ఇటీవల నాగర్‌కర్నూల్ డీఎం సిబ్బందికి సూచించారు. శనివారం స్టేజీ వద్ద బస్సును నిలపకపోవడంతో మహిళా ప్రయాణికులు కండక్టర్‌తో వాగ్వివాదానికి దిగారు. కొల్లాపూర్ డిపోకు చెందిన టీఎస్–31టీఏ 5722 నంబరు గల ఆర్టీసీ బస్సు కోడుపర్తి మిట్ట స్టేజి వద్ద నిలపలేదు. 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న తిమ్మాజిపేటలో ఆపడంతో ప్రయాణికులు కండక్టర్‌తో వాగ్వివాదానికి దిగారు. డీఎం చెప్పినా బస్సు ఎందుకు నిలపలేదని ప్రశ్నించారు. చివరకు గొడవ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. పోలీసులు వారిని శాంతింపజేశారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



నాగర్‌కర్నూల్‌రూరల్/కొల్లాపూర్‌రూరల్/కల్వకుర్తి రూరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 29వ వర్ధంతిని శనివారం నాగర్‌కర్నూల్, కొల్లాపూర్‌లో నిర్వహించారు. జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుడు ఎంపీ జాఫర్ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొల్లాపూర్ పట్టణంలో ఎన్టీఆర్ చౌరస్తాలో ఎన్టీఆర్, నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కల్వకుర్తిలో హమాలీలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్రహ్మానందరెడ్డి, సురేందర్ సింగ్, ఖాదర్ పాషా, గోవిందు గౌడ, కురుమయ్య, లక్ష్మణ్‌గౌడ్, రాజేందర్ సింగ్, మధు, శ్రీనివాసులు, నిరంజన్, రామ్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

కొల్లాపూర్ రూరల్: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన ఘటన శనివారం పట్టణంలో చోటు చేసుకుంది. ఎద్దు విలువ దాదాపు రూ. 60 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

పథకాలపై విస్తృత ప్రచారం

వీపనగండ్ల: భారత ప్రభుత్వ రంగ సంస్థ పోస్టల్ శాఖ ద్వారా ప్రజలకు పలు బీమా పథకాలు అమలవుతున్నాయని, వాటిపై శనివారం మండల కేంద్రంలో పోస్టల్ శాఖ అధికారులు ఇంటింటికి తిరుగుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సంవత్సరానికి రూ.555లు చెల్లిస్తే రూ.10 లక్షల ప్రమాద బీమా, రూ.755లు చెల్లిస్తే రూ.15 లక్షల బీమా వర్తిస్తుందని అధికారులు తెలిపారు. శాశ్వత అంగవైకల్యం కలిగినా ఈ పథకాల ద్వారా ప్రయోజనం పొందవచ్చని బీపీఎం జగదీశ్వర్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, ఏబీఎం నందిని తెలిపారు.

అసంపూర్తిగా బీటీరోడ్డు



తెలకపల్లి: మండల కేంద్రం నుంచి రామగిరి వరకు రెండు సంవత్సరాల కిందట బీటీ రోడ్డు మంజూరయ్యింది. సంబంధిత కాంట్రాక్టర్ బీటీ పనులు చేపట్టారు. పల్లెబావులు దర్గా వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ఇరువైపులా కంకర వేసి బీటీ వేయకుండా వదిలేశారు. రామగిరి నుంచి రామగిరిగుట్ట సమీపంలో బీటీ రోడ్డు వేయకపోవడంతో గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంకరతేలడంతో వాహనదారులు అదుపుతప్పి కిందపడి ప్రమాదాలభారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న రోడ్డును బీటీ వేసి ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.